**మా**నవుడు తను పుట్టిన మొట్టమొదటి రోజునుండి స్వేచ్ఛగా, స్వతంత్రంగా బతకాలని కోరుకుంటాడు. ఆ కోరిక వయసు పెరిగే కొద్దీ మరింతగా బలపడుతు వుంటుంది. దీన్ని తీర్చుకోడానికి మనిషి సైన్స్‌ని ఆశ్రయించాడు. సైన్స్ మనిషికి ఎన్నో సుఖాలనందించి తన అవసరాలకు ఇంకొక వ్యక్తిమీద ఆధారపడడాన్ని తగ్గించింది. అయితే ఇలా ఎప్పుడూ ఆనందంగా జీవితం కొనసాగించాలని ఆశపడే మనిషి దురదృష్టశాత్తు ఒక నయం కానటువంటి జబ్బుతో బాధపడుతు దుర్భరమైన జీవితం గడపడంకన్నా ఆ జీవితాన్ని తనకు తానుగా అంతం చేసుకునే స్వేచ్ఛని కోరుకోవడం తప్పా?...కాదు అని నేనంటాను. చికిత్సకి అందనటువంటి జబ్బుతో బాధపడుతున్న వ్యక్తి తను కోరుకున్నప్పుడు ఒక డాక్టర్ సహాయంతో యుథనేషియా అంటే మెర్సీ కిల్లింగ్, సుఖమరణం పొందే హక్కు కలిగి వుండడం న్యాయం. దీనికి ప్రభుత్వం ఒక చట్టం చేసి దాని ద్వారా మెర్సీకిల్లింగ్‌ని అనుమతించి తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని కోరుకుంటున్నాను...'

'కామాలు, ఫుల్‌స్టాపులు లేని వ్యాసంలా సాగుతుంది డాక్టర్ సూర్యప్రకాశ్ ప్రసంగం. సూర్యప్రకాశ్ టౌన్‌లో ఓ పేరున్న డాక్టర్. ప్రతి విషయాన్నీ ప్రాక్టికల్‌గా ఆలోచించే వ్యక్తి. సెంటిమెంట్స్‌కి ఎటువంటి పరిస్థితుల్లోను తావివ్వని మనిషి. విదేశాల్లో మెడిసిన్ చదువుకుని, మెర్సీకిల్లింగ్‌ని చట్టబద్ధం చేయాలని అహర్నిశలు శ్రమిస్తున్న ప్రఖ్యాత కార్డియాలజిస్ట్.

కాన్ఫరెన్స్ హాల్ ముందు సూర్యప్రకాశ్ కారు పార్క్‌చేసి వుంది. డ్రైవర్ బాబురావు టైమ్ చూసుకున్నాడు.

పదకొండుగంటలైంది.

'టప్' మని రిస్ట్‌వాచిమీద పడిందొక చినుకు

పైకి చూసాడు. దట్టంగా మబ్బులు కమ్ముకున్నాయి.

తెల్లవారి దగ్గర్నుండి వీస్తున్న ఈదురుగాలులు మరింతగా వీచడం ప్రారంభించాయి.

నిన్న ఉదయంనుండి రేడియోలో గంటగంటకీ ప్రసారం చేస్తున్న తుపాను హెచ్చరికలు గుర్తొచ్చాయి బాబూరావ్‌కి.

మళ్లీ టైమ్ చూసుకున్నాడు.

'డాట్టరుబాబు కాన్ఫరెన్సు ఇంకా పూర్తయినట్టు లేదు. ఫ్చ్...ఈయనెప్పుడూ ఇంతే తుపానురానీ, పిడుగులు పడనీ ఇక్కడో మీటింగు, అక్కడో కాన్ఫరెన్సు, ఎక్కడ మాట్లాడినా సివరికి మెర్సీ కిల్లింగ్‌లోకి ఎల్లిపోతాడు. ఈయన్ని కట్టుకుని ఆయమ్మ ఎంత బాదపడతుండారో...అమ్మగారు సాలా మంచిది. అద్దె ఇల్లో నేను పడతన్న అవస్త సూసి 'ఎక్కడో ఎందుకు బాబూరావ్ మన అవుటవుసు వుందిగా' అని ఎంటనే రిపేరు చెయ్యించి నాకిప్పించినారు. మొన్నటికి మొన్న మా యావిడ పుట్టింటికెల్తంటే అయ్యగారు సూడకుండా అయిదు వందలు దాని సేతిలో ఎట్టి, తిరిగొచ్చేటప్పుడు పండంటి బిడ్డనెత్తుకుని రావాల అని దీవించింది సల్లని తల్లి. అలాంటి మహాతల్లిని అయ్యగారసలు పట్టించురకోడు. ఎప్పుడూ ఆస్పత్రే, మీటింగ్‌లూ....

'బాబూరావ్' డాక్టర్‌గారి పిలుపుతో ఈలోకంలోకి వచ్చాడు.

కారెక్కాడు సూర్యప్రకాశ్

'హాస్పిటల్‌కు పోనీ' అన్నాడు.

కారు కదిలింది. వర్షం పెరిగింది.

కారు పోర్టికోలో ఆగానే ఆఫీస్ బాయ్ సుందరం నమస్కారం చేసాడు. సూర్యప్రకాశ్ కారుదిగి నేరుగా తన రూమ్‌లోకి వెళ్లాడు. సుందరం ఆరోజు వచ్చిన పోస్టు తెచ్చి సూర్యప్రకాశ్ టెబుల్ మీద పెట్టాడు.

అందులోని ఓ ఇన్విటేషన్ కార్డుమీద డాక్టర్‌గారి చూపుపడింది.

కవర్ తెరిచాడు.

కొత్త ఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ మెడికల్ సైన్సెస్‌లో నిర్వహించబోతున్న ఎయిడ్స్‌మీద అంతర్జాతీయ సదస్సు. ప్రధాన వక్తగా తనపేరుంది. డేట్ చూసాడు. ఆంకా వారం రోజులుంది. వెంటనే విషయాన్ని కాలిఫోర్నియాలో మెడిసిన్ చదువుతున్న తన కొడుకు రమేశ్‌కి ఫోన్ చేసి చెప్పాడు.

'కంగ్రాచ్యులేషన్స్ డాడీ, వీలైతే ప్రొసీడింగ్స్ రికార్డు చేసి పంపించండి, ఇక్కడే చూస్తాను'

ఒకే అని ఫోన్ పెట్టేసాడు.

'సార్' పిలుపుతో తలతిప్పి చూసాడు.

ఎదురుగా సిస్టర్ మేరీ నిలబడివుంది.

'ఊ ఏంటి'

'అమ్మగారికి బ్లీడింగ్ ఎక్కువైంది సార్. మీరు చెప్పిన కోర్సు వాడాను. తగ్గలేదు'

సరే డాక్టర్ లతకి ఫోన్ చేసి చెప్పు.

అలాగేసార్. వెళ్లిపోయింది.

ఢిల్లీ ప్రయాణానికి ఏర్పాట్లు ప్రారంభించాడు సూర్యప్రకాశ్

★ ★ ★

ఆరోజు సాయంకాలం కాకముందే చీకటి పడింది.

వర్షం జోరు ఎక్కువైంది.

ఉండుండి కళ్లు మిరుమిట్లు గొల్పేలా మెరుపులు మెరుస్తున్నాయి.

చెవులు పగిలిపోతాయేమోనన్నట్టుగా ఉరుముతున్నాయి.

ఈదురు గాలులు పెనుగాలుల్లోకి మారాయి.

బాబురావుకి నిద్రపట్టలేదు.

మంచంలో ముడుచుకు పడుకున్న తల్లివైపు చూసాడు.

చలికి గడగడ వణుకుతు వుంది.

మధ్య మధ్యలో మూలుగుతోంది.

కిటికీలోంచి బయటకు చూడ్డానికి ప్రయత్నించాడు.

ఏమీ కనిపించడంలేదు. కటిక చీకటి. కిటికీ మూసేసాడు.

ఆలాగే రాత్రంతా మేల్కొని కూర్చున్నాడు.

రేడియోలో గంటగంటకి చెబుతున్న హెచ్చరికలు వింటూ కూర్చున్నాడు.

తుపాను తెల్లవారు జామున తీరం దాటవచ్చని చెప్పారు.

పుట్టింటి కెళ్లిన తన పెళ్లాం ఎలా వుందో

బాబూరావ్‌కి ఆందోళనగా వుంది.

తెల్లవారింది. తుపాను తగ్గుముఖం పట్టింది.

లేచి ముఖం కడుక్కున్నాడు.

అద్దంలో ముఖం చూసుకున్నాడు. పీక్కుపోయి వుంది. రేడియో ఆన్ చేసాడు.

'....ఆకాశవాణి వార్తలు వింటున్నారు. తుపాను దెబ్బతిన్న అన్ని ప్రాంతాలలోను సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికపై చేపడుతున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. మరణించిన వారి కుటుంబానికి నష్ట పరిహారంగా లక్ష రూపాయలు, గాయపడిన వారికి ఒక్కొక్కరికి అయిదువేల రూపాయలు ఎక్స్‌గ్రేషియా వెంటనే విడుదల చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన చెప్పారు....'

'ఒరే నాయినా..బాబు...తల్లిగొంతు బలహీనంగా వినపడింది.


బాబూరావ్ మెదడులో ఏదో మెరిసింది.

'ఒరే కాసిని మంచినీళ్లు ...గొంతెండిపోతుండాదిరో...నేనింక బతకన్రో...'

అంత హీనస్వరంలో కూడా 'నే బతకన్రో నాయినో' అనేది బాబురావ్‌కి బాగా స్పష్టంగా వినపడింది.

'దారుణం, పాపం' మనసు మూలిగింది.

'....ఇకెలాగు బతకదు అనుకున్నప్పుడు మెర్సీ కిల్లింగ్ తప్పుకాదు' అయ్యగారి



# కొత్త శత్రువు

దువ్వూరి రాజారెడ్డి

మాటలు గుర్తొచ్చాయి.

'పేషంట్ కోరుకుంటేనే....' అనే విషయాన్ని గుర్తు రాకుండా జాగ్రత్త పడ్డాడు.

'నేనేమైనా సంపుతుండానా దానికే ఆయుషు తీరింది' అని సర్ది చెప్పుకున్నాడు.

వెంటనే డాక్టర్‌కి చూపిస్తే తను చచ్చిపోదు అనే నిజాన్ని పక్కకి నెట్టాడు బాబురావ్. లక్ష రూపాయలు మరి.

★ ★ ★

'బాబూరావ్, సుందరం రాలేదా' డాక్టర్ సూర్యప్రకాశ్ బాల్కనీనుండి పిలుస్తున్నాడు.

'రాలేద్సార్, నిన్న కూడా వచ్చినట్టు లేదు'

ఇంటికెళ్లి కనుక్కురా

బాబురావ్ సైకిల్ స్టాండ్ తీసిన రోడ్‌మీదకి పోనిచ్చాడు.

రోడ్ టర్నింగ్ తిరగ్గానే సుందరం ఇంటి ముందు జనం గుంపుగా కనిపించారు. పోలీస జీపొకటి ఆగుంది.

కాపౌండ్‌లోకి అడుగుపెట్టాడుర.

వరండాలో సుందరం తలదించుకుని నిలబడి వున్నాడు.

పక్కనే ఓ పోలీసు

వీధిలోని జీప్‌వైపు చూసాడు బాబురావ్.

ఇన్‌స్పెక్టర్ నిలబడి ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

'నమస్తే సార్, నాపేరు బాబూరావ్, నేను డాక్టర్ సూర్యప్రకాశ్ కారు డ్రైవర్ని' చెప్పాడు.

'ఊ' అన్నాడు ఇన్స్‌పెక్టర్

'సుందరం మా ఆస్పత్రిలోనే పన్చేస్తాడు సార్. డాక్టర్‌గారు ఏమైందో కనుక్కొని రమ్మన్నారు.'

'వీడు వాళ్ల నాన్నని మర్డర్ చేసాడు. అరెస్టు చేసాం'

ఏదో తెలియని భయంతో సన్నగా వణుకు మొదలైంది బాబూరావ్‌కి.

వారం రోజుల క్రితం సుందరం తనతో అన్నమాటలు గుర్తొచ్చాయి.

'మా ముసలోడికి టిబి. అది తగ్గదు. ఈడు సావడు. కనీసం ఆడు రిటైరయ్యేలోపల పోతే ఆడి జాబు నాకొస్తుంది. ఎన్నిరోజులిలా ప్రైవేటుద్యోగం చెయ్యను'

బాబూరావు వణుకుతున్న తన చేతులు పాంటు జేబులో పెట్టుకుని నిలబడ్డాడు.

సుందరానికి సంకెళ్లు వేసారు.

జీప కదిలింది.

హాస్పిటల్‌కెళ్లి డాక్టర్‌గారికి విషయం చెప్పాడు బాబూరావ్

సూర్యప్రకాశ్ అంతా విన్నాడు.

కామ్‌గా తన రూమ్‌కి వెళ్లి ఆరోజు ఎర్లీ మార్నింగ్ తన ప్రయాణానికి కావాల్సిన వాటిని చెక్ చేసుకుంటూ వుండిపోయాడు.

'సార్, అమ్మగారికి సీరియస్‌గా వుందిసార్' సిస్టర్ మేరీ గొంతులో కంగారు.

'ఊ లలితకి ఫోన్ చేయి' తలతిప్పకుండా చెప్పాడు.

'లలితగారు వచ్చార్సార్'

'ఇంకేం చూడమను' దానికింత కంగారెందుకు అన్నట్టుగా వుంది అతని గొంతు.

సిస్టర్ వెళ్లిపోయింది.

సెమినార్‌లో మాట్లాడాల్సిన విషయాలమీద నోట్స్ రాసుకోవడం మొదలెట్టాడు.

రాత్రంతా అలా రాసుకుంటునే ఉన్నాడు.

గోడగడియారం నాలుగు గంటలు కొట్టింది.

లేచాడు సూర్యప్రకాశ్. బయట కారు రెడీగా వుంది. బాబూరావ్ డోర్ తెరిచి పట్టుకున్నాడు.

కార్లో కూర్చున్నాడు.

ఎందుకో మనసంతా గజిబిజిగా వుంది.

కారు ఎయిర్‌పోర్టువైపు దూకింది.

★ ★ ★

సెమినార్‌లో 'ఎయిడ్స్ అనేది ఒక నయం చేయలేనటువంటి జబ్బని, ఆ వ్యాధి సోకిన వాళ్లు ఎలాగూ బతికే అవకాశం లేదుకాబట్టి, వాళ్లకి ఆ బాధనుంచి విముక్తి ప్రసాదించాలంటే ఒక్కటే శరణ్యమనీ, అదే మెర్సీ కిల్లింగ్ అనీ, దాన్ని చట్టబద్ధం చేయాలని, అది తన జీవితాశయం అనీ, అందుకోసం డాక్టర్లంతా కదిలి రావాలని, ఇలాంటి ప్రాణాంతకమైన వ్యాధులు పెట్టే బాధలనుండి రోగులను 'రక్షించేవరకు' తనకు విశ్రాంతి లేదని ఆవేశంగా మాట్లాడాడు.

ప్రసంగం ముగించి కూర్చున్నాడు సూర్యప్రకాశ్

హాల్ చప్పట్లతో మారుమోగింది.

'సర్, ఎ కాల్ ఫ్రం యువర్ హౌస్' ఎవరో కార్డ్‌లెస్ అందించారు.

హలో

'సార్, అమ్మగారు...' ఫోన్‌లో సిస్టర్ మేరీ

'ఊ చెప్పు'

'సార్ అమ్మగారు, అమ్మగారు...' సిస్టర్ ఏడుపు స్పష్టంగా వినపడుతోంది.

ఫోన్ ఆఫ్‌చేసి వెనక నిలబడున్న ఇందాకటి వ్యక్తికందించాడు

సెమినార్ సక్సెస్‌ఫుల్‌గా ముగిసింది.

సాయంకాలం ఫ్లైట్ కాచ్ చేసాడు.

విమానంలో తన సీట్‌లో కూర్చుని వెనక్కి వాలి కళ్లు మూసుకున్నాడు.

మనసులో ఏదో అలజడి.

'నయం కానిరోగం'

'బాధనుండి రిలీఫ్'

యుథనేషియా, మెర్సీకిల్లింగ్, సుఖ మరణం

ఇదే అల్టిమేట్ సొల్యూషన్

మెదడంతా గందరగోళంగా వుంది.

మరి రోగికి సుఖమరణం కన్నా సుఖమైనజీవితం కోసం మనం చూపించాల్సిన ఆప్యాయత, ఆదరణ, ఇలాంటి వాటికూ్కడా సైన్స్‌ని ఆశ్రయించాలా

వాటికూ్కడా సైన్స్‌ని ఆశ్రయించాలా

సూర్యప్రకాశ్ 'హృదయం' కొత్త కోణంలో ఆలోచించడం మొదలుపెట్టింది.

★ ★ ★

కాల గమనంలో మరో పదేళ్లు గడిచాయి.

సూర్యప్రకాశ్ కొడుకు డాక్టర్ రమేష్ ఇండియాకొచ్చి ప్రాక్టీస్ చేస్తున్నాడు. వయోభారంతో మునుపటి జవసత్వాలు కోల్పోయిన తండ్రి అవసరాలు చూడడానికి ఓ అటెండర్‌ని నియమించాడు. ఇపుడు సూర్యప్రకాశ్ బిజీగాలేడు. బోలెడు విశ్రాంతి.

పుస్తకాలు, టీవీ, విసిఆర్, అబ్బో ఎన్నో

కానీ తనుమాత్రం ఎవరికీ అక్కర్లేదు.

రోజులాగే రమేశ్ నర్సింగ్‌హోమ్‌కెళ్తు

'డాడీ నిన్న ఓ కేస్ వచ్చింది. ఫాదర్‌కి లాస్టియర్‌నుంచి పెరాలిసిస్ అట. మీకేసే. అతని పన్లు చూడడానికి వాళ్లావిడ, పిల్లలు విసుక్కుంటున్నారట అతన్ని మెర్సీ కిల్లింగ్ ద్వారా వదిలించుకోవాలనుకుంటున్నాడట. మనం ఏదన్నా హెల్ప్ చేయగలమా డాడ్'

'నో, పేషంట్‌కి ఇష్టం లేకుండా ఏమీ చేయడానికి లేదు. అది కూడా ప్రభుత్వం చట్టం చేసేదాకా మనం చెయ్యకూడదు' ఆవేశపడుతూ చెప్పాడు సూర్యప్రకాశ్

'ఇష్టపడుతున్నట్టు రాసి సంతకం పెట్టిస్తానంటున్నాడు'

'నో...నో...ప్లీజ్ డోన్ట్‌డూదట్' అరిచాడు సూర్యప్రకాశ్

'ఒకే డాడ్ మీరు ఎక్సయిటవ్వకండి' అంటూ వెళ్లిపోయాడు.

సూర్యప్రకాశ్‌కి కొడుకు మాటలు పదే పదే గుర్తుకు వస్తున్నాయి.

'మనం ఏదన్నా హెల్ప్ చేయగలమా డాడ్'

శరీరంతోపాటు మనసు కూడా మొద్దుబారితే బాగుండుననుకున్నాడు. కళ్లు మూసుకుని వీల్‌చైర్‌లో వెనక్కి ఆనుకున్నాడు.

దగ్గర్లోవున్న రోటరీ చిల్డ్రన్స్ ఆడిటోరియంలో ఏదో మీటింగు జరుగుతున్నట్టుంది. లౌడ్ స్పీకర్‌లోంచి మాటలు స్పష్టంగా వినపడుతున్నాయి.

'సుఖ శాంతులు అందిస్తానంటు మనిషి జీవితంలోకి ప్రవేశించింది సైన్సు. అయితే సహజంగా గాలి, వెలుతురు లభించే పల్లెటూర్లను వదిలేసి జనారణ్యాలుగా మారిపోయిన నగరాలలోకి వచ్చి అదే గాలి, వెలుతురిని డబ్బుపెట్టి కొనుక్కుంటూ హైగా సైన్స్ ప్రసాదించిందంటు భ్రమ పడడం ప్రారంభించాం. సైంటిఫిక్ డెవలప్‌మెంట్ వలన వచ్చిన పరిశ్రమల ఫలితంగా ఉద్యోగ అవకాశాలు పెరిగి కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమైపోయింది. దాని ఫలితంగా తల్లిదండ్రుల ముద్దు ముచ్చటలో పెరగాల్సిన పిల్లలకోసం బేబీకేర్ సెంటర్లు, బిడ్డలు అమ్మానాన్నల పట్ల తమ బాధ్యత మరిచి పోయేందుకు వీలుగా నాగరికత ముసుగులో ఓల్డ్‌ఏజ్ హోమ్స్ వెలిసాయి. ఈ రోజు మనలో ముసలి తల్లిదండ్రులు 'ఇంకా ఎందుకు బతికున్నార్రా బాబు' అని అనుకునే వాళ్లు ఎంతమంది లేరు. మానవ జాతి పేదరికం, అజ్ఞానం, అనారోగ్యం ఇలా ఎన్నో శత్రువుల్ని ఎదుర్కొంది. ఎదుర్కుంటోంది. వీటన్నింటినీ పరిష్కరిస్తుందని మనిషి సైన్స్‌ని నమ్ముకున్నాడు. బట్ ఇప్పుడవు ఈసైన్సే ఒక కొత్త శత్రువుగా తయారై మానవ సంబంధాల్ని అన్నింటినీ సమూలంగా నాశనం చేస్తుంది. ఫ్రెండ్స్ ఒక్కసారి ఆలోచించండి. ఇలాంటి సైంటిఫిక్ డెవలప్‌మెంట్‌నా మనం కోరుకుంది...'

'నో' డాక్టర్ సూర్యప్రకాశ్ హృదయం మూలిగింది.

★